RNI NO : TELTEL/2023/86487

క్విక్ టుడే

QUICK TODAY

శనివారం 7 సెప్టెంబర్ 2024

quicktodaynews.com



# బఫర్.. సఫర్



**35 ఏళ్లకు పైగా నివాసం ఉంటున్న వారికి తహసీల్దార్ నోటీసులు**

**ఇన్నేండ్లు లేని బఫర్, ఎఫ్‌టీఎల్ ఇప్పుడేలా వచ్చిందంటూ ఆవేదన**

**మేడిపల్లి తహసీల్దార్ ఎదుట భారీ ఎత్తున బాధితుల ఆందోళన**

**నోటీసులు వాపస్ తీసుకోవాలంటూ నిరసన**



**పీర్జాదిగూడ, సెప్టెంబర్ 6 (క్విక్ టుడే న్యూస్) :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని పీర్జాదిగూడ పెద్ద చెరువు బఫర్ జోన్‌లో ఇండ్లు నిర్మించారంటూ దాదాపు 160 కుటుంబాలకు మేడిపల్లి తహసీల్దార్ హైడ్రా కమిషన్ పేరుతో నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో నోటీసులు అందుకున్న బాధితులు శుక్రవారం మేడిపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మీడియాతో మాట్లాడుతూ 35 సంవత్సరాల క్రితం తాము పట్టా భూములు కొనుక్కొని బ్యాంకు లోన్లతో ఇండ్లు కట్టుకున్నామని,ఇంటి పన్నులు, కరెంటు బిల్లులు, నీటి బిల్లులు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆకస్మాత్తుగా బఫర్ జోన్ లో ఇండ్లు ఉన్నాయని, వారం రోజుల్లో ఇండ్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని నోటీసులు పంపడం చాలా అన్యాయమని మండిపడ్డారు. పేద, మధ్య తరగతికి చెందిన మేము చిన్న చిన్న వ్యాపారాలు,ఉద్యోగాలు చేస్తూ పట్టా భూముల్లో ప్లాట్లు కొనుక్కొని,బ్యాంకు లోన్లతో ఇండ్లు నిర్మించుకున్నామని తెలిపారు. ఇన్నేళ్లు లేని పెద్ద చెరువు బఫర్ జోన్ ఇప్పుడు ఎలా వస్తుందని ప్రశ్నించారు. అసలు బఫర్ జోన్ లో రిజిస్ట్రేషన్ అవుతాయా? గ్రామపంచాయతీ ఇంటి నిర్మాణానికి పర్మిషన్లు ఇస్తుందా? గతంలో మంచినీటి చెరువుగా ఉన్న పెద్ద చెరువు ఇప్పుడు డ్రైనేజీలు కలపడంతో మురికి కూపంగా మారిందన్నారు. దుర్వాసనతో పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నారని, డ్రైనేజీ పైప్ లైన్లు నేరుగా మూసిలో కలిపి పెద్ద చెరువును ప్రక్షాళన చేయాలని కోరారు. తమ ఇండ్లను బఫర్ జోన్ నెపంతో కూల్చాలని చూస్తే తాము ప్రాణ త్యాగానికైనా సిద్ధమని బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పేదలకు ఇచ్చిన నోటీసులను రెవెన్యూ అధికారులు వెనక్కి తీసుకోవాలని ,సమగ్ర సర్వే నిర్వహించాలని బాధితులు డిమాండ్ చేశారు. నోటీసులు వచ్చినప్పటి నుంచి మానసికంగా కుంగిపోతున్నామని, ఎప్పుడు ఎవరు వచ్చి తమ ఇండ్లు కూల్చేస్తారేమోననే భయంతో బతుకుతున్నామని కన్నీటి పర్యంతం అయ్యారు. అప్పట్లో బఫర్ జోన్ అంటే ఏమిటో ఎవరికీ తెలియదని, ఇప్పటికీ ఇంకా దీని అర్థం కూడా చాలా మందికి తెలియదని తెలిపారు. చెరువులను ఆక్రమించిన బడాబాబులపై చర్యలకు పాల్పడితే పర్వాలేదు కానీ, తమ వంటి పేదలపై కూల్చివేతలు చేపడితే మాత్రం ప్రభుత్వ పతనం తప్పదని హెచ్చరించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేసిన మోసాలకు తమను బలిపశువులను చేస్తారా..? అంటూ ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే నోటీసులు వాపస్ తీసుకోవాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామంటూ అధికారులను హెచ్చరించారు.





## రోడ్డు విస్తరణ పనుల

# వేగం పెంచండి

**-అధికారులను ఆదేశించిన పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్**

**-పీర్జాదిగూడ- పర్వతాపూర్ రోడ్డు విస్తరణ పనుల పరిశీలన**




**పీర్జాదిగూడ, సెప్టెంబర్ 6 (క్విక్ టుడే న్యూస్) :** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో హెచ్ఎండిఏ నిధులతో చేపట్టిన పీర్జాదిగూడ,పర్వతాపూర్ రోడ్డు విస్తరణ పనులను మేయర్ అమర్ సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. సంబంధిత విస్తరణ పనులలో జరుగుతున్న జాప్యంపై అధికారులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా ఎలక్ట్రికల్స్ పోల్స్ ను త్వరగా మార్చాలని సంబంధిత కాంట్రాక్టర్ ను సూచించినారు. అదే విధంగా ప్రజలు కూడా సహకరించాలని కోరినారు. హెచ్ఎండబ్ల్యూ ఎస్ అండ్ ఎస్బీ జలమండలి అధికారులతో వాటర్ లైన్ త్వరగా రిపేర్లు చేసి రోడ్డు పాడవకుండా చూడాలని వారికి సూచించారు. మరీ ముఖ్యంగా రోడ్డు పనులతో గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నందున వెంటనే ఈ రోజే రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను కూర్చాలని సంబంధిత కాంట్రాక్టర్ లకు సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, సీనియర్ నాయకులు, కుర్ర శ్రీకాంత్ గౌడ్,దేవేందర్ గౌడ్,యసారం మహేష్, బొడిగె కృష్ణ,అలువాల దేవేందర్ గౌడ్,వంగూరి పరమేష్, కో ఆప్షన్ సభ్యులు చిలుముల జగదీశ్వర్ రెడ్డి, హెచ్ ఎండీఏ డిజి వేణుగోపాల్, మున్సిపాలిటీ డీఈ సాయినాథ్ గౌడ్, హెచ్ఎండబ్ల్యూ ఎస్ అండ్ ఎస్బీ మేనేజర్ తిరుపతి, రమేష్ బాబు సంబంధిత కాంట్రాక్టర్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు కేసీఆర్ వినాయక చవితి శుభాకాంక్షలు

**హైదరాబాద్,సెప్టెంబర్6 (క్విక్ టుడే న్యూస్):** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. కష్టాలను తొలగించి ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలను నింపాలని గణనాథున్ని ఈ సందర్భంగా కేసీఆర్ ప్రార్థించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తి శ్రద్ధలతో వినాయకున్ని ప్రార్థించి దేవ దేవుని అనుగ్రహం పొందాలని కేసీఆర్ తెలిపారు.

# భారతీయులను ఏకం చేసిన వినాయక చవితి

## బాగంగాధర్ తిలక్ స్ఫూర్తితో ఏటా ఉత్సవాలు



**హైదరాబాద్,సెప్టెంబర్6 (క్విక్ టుడే న్యూస్):** స్వాతంత్రోద్యమంలో ప్రజలను ఏకతాటిపైకి తీసుకుని వచ్చేందుకు వినాయక నవరాత్రలను బాగా ఉపయోగించుకున్నారు. ప్రజలను భక్తిభావంతో ఏకం చేసి బ్రిటిషర్లకు వ్యతిరేకంగా నడిపించారు. ఇందులో భాగంగా ఇంటికే పరిమితమైన గణపతి పూజను నవరాత్రులుగా మలిచిన ఘనత లోకమాన్య బాలగంగాధర తిలక్ సొంతం. వలస పాలనలో వివక్షకు లోనవుతున్న భారతీయ సంస్కృతి, సంప్రదా యాలను పునరుద్ధరించేందుకు తొమ్మిది రోజుల వేడుక ఒక ప్రత్యేక సందర్భం. జాతీయోద్యమంలో భాగంగా మహారాష్ట్ర పుణెలో 1893లో లోకమాన్య తిలక్ గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు పిలుపునిచ్చారు. ఆ స్ఫూర్తి భాగ్యనగరానికీ వ్యాప్తి చెందింది. ఆనాటి నుంచి ఇప్పటి వరకు గణపతి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. దేశభక్తి, స్వాతంత్య కాంక్షను సామాన్యుల్లో రగిలించేందుకు, గమ్యం తెలియని బాటసారి లా అయోమయంలో ఉన్న యువతను ఒక సామాజిక లక్ష్యం దిశగా నడిపించేందుకు, 127 ఏళ్ల క్రితం మహారాష్ట్రలోని పుణె కేంద్రంగా సర్వ జనైక్య గణేశ్ ఉత్సవాలకు లోకమాన్య బాలగంగాధర తిలక్ పిలుపునిచ్చారు. గణపతి నవరాత్రులను సామాజిక వేదికలుగా మలిచారు. ఆ జాతియోద్యమ స్ఫూర్తి దేశవ్యాప్తంగా వ్యాపించింది. స్వరాజ్యం నా జన్మహక్కు అని నినదించిన తిలక్ పిలుపుతో కొందరు భాగ్యనగరవాసులు ముందుకొచ్చారు. నగరంలో స్థిరపడిన కొందరు మహారాష్ట్రీయులు సామూహిక వినాయక పూజకు నాంది పలికారు. దాదాపు 125 ఏళ్ల క్రితం అలా హైదరాబాద్‌లోని గణపతి ఉత్సవాల శోభ ప్రారంభమయ్యింది. భాగ్యనగరంలో గణేశ్ ఉత్సవాలు తొలిసారిగా పాతబస్తీలోని శాలిబండ ప్రాంతంలో ప్రారంభమయ్యాయి. కొందరు మరాఠాలు 1895లో గణేశ్ ఉత్సవాలను సామూహికంగా నిర్వహించడం ప్రారంభించారని చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. 1895, మార్చి 27న శాలిబండలో ఉగాది పర్వదినం రోజున భారత గుణవర్ధక్ సంస్థను స్థాపించారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న మహారాష్ట్రీయులైన బాలచంద్ర దీక్షిత్, వక్రతుండ దీక్షిత్, నారాయణరావు పిల్‌ఖానె, లక్ష్మణరావు సదావర్తె, దాదాచారి కాలె తదితర మిత్ర బృందం సారథ్యంలో మరికొందరి స్థానిక కాయస్తులు, వ్యాపారవేత్తల సహకారంతో ఆ మరాఠా సంస్థను నెలకొల్పారు. అప్పటి నుంచి కులమతాలకతీతంగా అందరూ కలిసి గణపతి మండపాలను నెలకొల్పడం, తద్వారా రాజకీయ చర్చలు, స్వాతంత్య స్ఫూర్తిని యువతలో ప్రేరేపించే సభలు, సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించే క్రతువుకు శ్రీకారం జరిగింది. ఆ సంస్థ పాలకవర్గ సభ్యులు నేటికీ గణేశ్ నవరాత్రి వేడుకలను కొనసాగిస్తున్నారు. అప్పట్లో చెరువుల్లోని నల్లమట్టినే వినాయక ప్రతిమల తయారీకి వాడేవారు. చవితినాడు మట్టిగణపయ్యను ప్రతిష్ఠించి, తొమ్మిది రోజుల పాటు పూజ కార్యక్రమాలు నిర్వహించేవారు. సాయంత్రం వేళల్లో 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు జానపద నృత్యాలు, గీతాలాపన, భక్తి కీర్తనలు, భజన, పారాయణం, పద్య, ఇతిహాస నాటకాలు, సంగీత కచేరీ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. పిల్లలు, పెద్దలు, మహిళలు, పురుషులు, ధనిక, పేద తేడా లేకుండా అందరూ ఆ కార్యక్రమాలు చూసేందుకు పెద్ద ఎత్తున మండపాల వైపు తరలి వచ్చేవారు. ప్రారంభంలో శాలిబండ నుంచి నగరంలో మరికొన్ని ప్రాంతాలకు గణేశ్ ఉత్సవాలు విస్తృతమయ్యాయి. తొమ్మిది రోజుల పాటూ రోజూ సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాలు చూసేందుకు కుటుంబంతో సహా వెళ్లేవాళ్లం. రెండు కళ్లు చాలవు అన్నంతగా సంబరాలు జరిగేవి. పదో రోజు తెల్లవారుజామున పిల్లలు, పెద్దలు అంతా కలిసి మట్టి గణపతిని ఊరేగింపుగా తీసుకెళ్లి మూసీలో నిమజ్జనం చేసేవాళు ,,. అలా మొదలైన ప్రస్థానం ఇప్పుడు ఊరూవాడా విస్తరించింది. ఛత్రపతి శివాజీ పరిపాలనా సమయంలోనే మరాఠా రాజ్యంలో వినాయక ఉత్సవాలు ప్రారంభం అయ్యాయని కొందరు చరిత్రకారులు అంటారు. వినాయకుడిని పీష్వాలు తమ కులదేవుడిగా ఆరాధిస్తారు. కనుక 17వ శతాబ్దంలో శివాజీ చేతుల మీదుగా గణపతి నవరాత్రులు ప్రారంభమయ్యాయని కొందరి అభిప్రాయం. ఆయన స్ఫూర్తి కొనసాగింపుగా లోకమాన్య తిలక్ శివాజీ ఉత్సవాలు, గణేశ్ ఉత్సవాలను ప్రారంభించారని చారిత్రక అధ్యయనకారులు చెబుతారు. భాగ్యనగర గణపతి నవరాత్రి ఉత్సవాలు నగర ప్రజల సామరస్య జీవనానికి, ఐకమత్యకు అద్దం పడతాయి. హైదరాబాద్‌లోని కొన్ని వినాయక మండపాలలో లంబోదరుడి లడ్డూ ప్రసాదాన్ని కొందరు ముస్లిం, క్రిష్టియన్లూ వేలంపాట ద్వారా దక్కించుకోవడం అందుకు తార్కాణం. శోభాయాత్ర సమయంలో కొందరు ముస్లింలు మంచినీరు అందించడం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టిన సందర్భాలెన్నో ఉన్నాయి. రోడ్ల నిండుగా విగ్రహాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. ఆ తరవాతే లడ్డూ వేలాలు మొదలయ్యాయి. బాలాపూర్, ఖైరతాబాద్ ప్రసిదిద్ధికెక్కాయి.